దేవుడితో స్వార్థ రాజకీయాలా?

- పెనమలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి ఆగ్రహం
- చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కంకిపాడులోని విష్ణాలయంలో పూజలు చేయిస్తున్న దేవభక్తుని చక్రవర్తి, వైఎస్సార్ సీపీ నేతలు

కంకిపాడు: భగవంతుడిని సైతం తన కుట్రలకు, కుతంత్రాలకు వాడుకునే స్వార్థపరుడు సీఎం చంద్రబాబు నాయుడు అని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కంకిపాడు పట్టణంలోని విష్ణాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల విలేకరులతో చక్రవర్తి మాట్లాడారు. టీటీడీ లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగం అంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతో తిరుమల ప్రతిష్ట దిగజారుతుందన్నారు. తిరుమల ప్రతిష్ట, ప్రజల మనోభావాల పరిరక్షణ కోసం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన ఆలయాల్లో పూజలు చేశామని తెలిపారు. నాణ్యత లేని నెయ్యిని వెనక్కి పంపామని టీటీడీ అధికారులు చెబుతున్నా చంద్రబాబు మాత్రం యాగీ చేస్తూ ప్రజల మనోభావాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీల అమలుపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత భయంతో భగవంతుడిని సైతం తన రాజకీయాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. చంద్రబాబు హయాంలో కల్తీ నెయ్యి ఆలయానికి చేరితే గత ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం దారుణమని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అన్నే వేణుగోపాల కృష్ణమూర్తి (చిట్టిబాబు) మాట్లాడుతూ ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను దారి మళ్లించడానికి కల్తీ నెయ్యి అంటూ చంద్రబాబు బొంకుతున్నారని మండిపడ్డారు. మచ్చలేని, నిస్వార్థ ప్రజాసేవకుడు జగన్ అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, పలు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు రామినేని రమాదేవి, నందిపాటి బిందుమాధవి, పి.రాఘవరావు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, జేసీఎస్ మాజీ చైర్మన్ రాచూరి చిరంజీవి, ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, పెనమలూరు మండల అధ్యక్షుడు సంగెపు శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ సత్తా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు చిట్టూరి వరప్రసాద్, కోనా కిషోర్, తోకల ఉమాదేవి, సీహెచ్‌సీ మాజీ చైర్మన్ మేడంద్రావు కుటుంబరావు, నాయకులు రామకోటేశ్వరరావు, ఓంకారం తదితరులు పాల్గొన్నారు. చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించు స్వామీ అంటూ ప్రొద్దుటూరు రామాలయంలో వైఎస్సార్ సీపీ నేతలు శనివారం ప్రత్యేక పూజలు జరిపించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు భీమవరపు నాగిరెడ్డి, నాయకులు భీమవరపు రాజగోపాల్ రెడ్డి, భీమవరపు రమేష్‌రెడ్డి, బొట్ల వినోద్‌రెడ్డి, కే వెంకటరెడ్డి, వీ చలమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నున్న చినకంచిలో పూజలు



గన్నవరంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



మానికొండ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు



పోరంకి శ్రీవేణుగోపాలస్వామివారి దేవస్థానంలో పూజలు చేసిన వైఎస్సార్ సీపీ నేతలు

హిందూ ధర్మాన్ని కాపాడటంలో విఫలం

రామవరప్పాడు: తిరుమల పవిత్రత, శ్రీవారి ప్రసాదం విశిష్టతను మంటగలిపిన చంద్రబాబు పాపాల ప్రక్షాళన కోసం వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పలు గ్రామాల పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడటంలో చంద్రబాబు ఘోరంగా విఫలమై నోటికొచ్చిన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతున్నారని మండిపడ్డారు. జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు మాట్లాడుతూ చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశామని తెలిపారు. వైఎస్సార్ సీపీ గౌడ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మాదు శివరామకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్. వెంకటేశ్వరరావు, నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు, ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, రామవరప్పాడు కన్వీనర్ సమ్మెట సాంబశివరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎనికేపాడులోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అంబాపురం(విజయవాడరూరల్): తిరుమల లడ్డూ విశిష్టతపై విష ప్రచారం చేస్తున్న కూటమి నేతలకు మంచి బుద్ధి, జ్ఞానం ప్రసాదించాలని కోరుతూ అంబాపురం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కోకన్వీనర్ తోడేటి బెంజిమెన్, సీనియర్ నాయకులు గొడ్డళ్ల వెంకటేశ్వరరావు, శ్రీలక్ష్మి, ఏడుకొండలు, లక్ష్మి పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని చినకంచిలో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయంలో ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని సాంబిరెడ్డి, ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానంద రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నాయకులు దండు సుబ్రహ్మణ్యం రాజు, వార్డు సభ్యురాలు బట్టా అరుణ, షేక్ హుస్సేన్, సింహాచలం పాల్గొన్నారు.

గన్నవరం: టీటీడీ ప్రతిష్టతను దెబ్బతీస్తున్న సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మేచినేని బాబు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగ రాజకుమారి, పులువురు పార్టీ నేతలు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు దొడ్ల స్వర్ణకుమారి, కొత్తగూడెం సర్పంచ్ తూంపాటి రాంబాబు, పార్టీ నేతలు కూరేటి శ్రీకాంత్, అంగడాల సాంబయ్య, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: చంద్రబాబు పాపాల ప్రక్షాళన కోసం మండలంలోని తేలప్రోలు మానికొండలో వైఎస్సార్ సీపీ నాయకులు దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తేలప్రోలు శివాలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి, మానికొండలో వైస్ ఎంపీపీ వీరంకి కుసుమ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ తియ్యగూర వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజేంద్రరెడ్డి, శివకృష్ణ పాల్గొన్నారు.

పెనమలూరు: తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామివారి భక్తుల మనోభావాలు కాపాడాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నేతలు పోరంకి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేతలు పి.రాఘవరావు, అద్దేపల్లి చందు, బొర్రా కృష్ణ, బొర్రా వెంకటరమణయ్య, దేవినేని పున్నయ్య చౌదిరి, బొర్రా శివాజీ, గుడికందుల శివకోటి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చప్టా మరమ్మతుల పరిశీలన



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం వికాస్ కాలేజీ రోడ్డులో చినకంచి వద్ద పెద్ద వాగుపై ఉన్న చప్టాకు మరమ్మతులు నిర్వహించడానికి పంచాయతీరాజ్ అసిస్టెంటు ఇంజినీరు ఎస్.శివరామకృష్ణ శనివారం పరిశీలించారు. ఇటీవల వచ్చిన వాగు ఉధృతికి, అంతకుముందు సంభవించిన వరదలకు చప్టా అడుగు భాగం పూర్తిగా కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో మరమ్మతులు చేయడానికి రూ. 2.80లక్షలతో అంచనాలు తయారు చేస్తున్నామని ఏఈ తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని రెండు జగనన్న కాలనీలకు వెళ్లే రహదారుల మరమ్మతులకు గ్రాంటు రాగానే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

గృహాలు సకాలంలో నిర్మించాలి



పెనమలూరు: పక్కా గృహాలు సకాలంలో నిర్మాణం చేసుకుంటేనే ప్రభుత్వ రుణం అందుతుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. వణుకూరు జగనన్న కాలనీల్లో శనివారం ఆయన లబ్ధిదారులకు మన ఇల్లు–మన గౌరవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే మార్చి చివరి నాటికి ఇల్లు నిర్మాణం చేసుకోకపోతే రుణం రద్దు అవుతుందని తెలిపారు. స్థలం పట్టాకు ఎటువంటి ఇబ్బంది లేకపోయినా ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక సాయం అందదని పేర్కొన్నారు. ఎంపీడీవో సునీతాశర్మ, తాడిగడప కమిషనర్ భవానిప్రసాద్, అధికారులు, నేతలు చక్క గోపి, మారుపూడి ధనకోటేశ్వరరావు, ప్రభాకరరావు పాల్గొన్నారు.


గర్భిణులకు సామూహిక సీమంతాలు



పెనమలూరు: గోసాలలోని అంగన్‌వాడీ–3లో శనివారం గర్భిణులకు పెద్ద ఎత్తున సామూహిక సీమంతం నిర్వహించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో బేబీ సుకన్య మాట్లాడుతూ గర్భిణులు, తల్లులు, చిన్నారులు పోషకాహారం తీసుకోవడం వల్ల తల్లులు, బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారని అన్నారు. అనంతరం గర్భిణుల కు సీమంతంచేసి పండ్లు, చీరలు పంపిణీ చేశా రు. కార్యక్రమంలో సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ కె.శ్రీలత, అంగన్‌వాడీ కా ర్యకర్తలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

కంకిపాడు: మండలంలోని ఉప్పలూరు గ్రామంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా సామూహిక సీమంతాల కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు ఇచ్చే ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. సర్పంచ్ లాం సోనియా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి, గర్భిణులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలపై అవగాహన



ఉయ్యూరు: ఉయ్యూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలో మన ఇల్లు–మన గౌరవం గ్రామసభలు శనివారం నిర్వహించారు. ఆయా సభల్లో నిర్మాణ దశలో ఉన్న ఇంటి నిర్మాణ లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించి, త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఉయ్యూరు పరిధిలోని 11 గ్రామ పంచాయతీల్లో, మున్సిపాలిటీలో లబ్ధిదారులతో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు సమావేశం నిర్వహించి మార్చి 2025 నాటికి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఉయ్యూరు: స్కూల్‌గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజయవాడలోని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో అండర్–19 టైక్వాండో, కరాటే పోటీల్లో ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జూనియర్ కళాశాల విద్యార్థి విక్రమ్ సింహ ప్రతిభ చాటడంతో అక్టోబరు 1–5వరకూ కడప జిల్లాలో జరిగే ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్‌లో పాల్గొంటాడని జూనియర్ కళాశాల డైరెక్టర్ జీజేపీ వినయ్‌కుమార్ తెలిపారు. బాలికల విభాగంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుకు కళాశాల విద్యార్థులు రూప, ధరణిమానిక ఎంపికయ్యారని చెప్పారు. అక్టోబరు 6–8 వరకు శ్రీకాకుళంలో జరిగే కబడ్డీ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి తదితరులు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

భూషయ్య కుటుంబానికి మాజీ ఎంపీ కేశినేని పరామర్శ

ఉయ్యూరు: వ్యాపారవేత్త వల్లభనేని భూషయ్య కుటుంబ సభ్యులను విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని శనివారం పరామర్శించారు. భూషయ్య మాతృమూర్తి వల్లభనేని సత్యనాగ భానుమణి ఇటీవల కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ కేశినేని నాని గండిగుంట గ్రామంలోని భూషయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భానుమణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

ఉయ్యూరు: అభ్యుదయ కవి గుర్రం జాషువా జయంతి కార్యక్రమం ఉయ్యూరు గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. దళిత ఐక్యవేదిక వ్యవస్థాపకుడు పినమాల నాగకుమార్ ఆధ్వర్యంలో జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బివి. రమణి, నాయకులు ఎంజి. రవి, రంజిత్, సురేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా యువజనోత్సవాలు

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం యువజన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు స్టోరీ రైటింగ్, ఫోక్ డ్యాన్స్, పెయింటింగ్, సింగింగ్ ప్రాజెక్టు ఎక్స్‌పో తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి అధికారి విక్టర్‌బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతోపాటు పలు రంగాల్లో పాల్గొని ప్రతిభ చాటాలని సూచించారు. జిల్లా యువజన సంక్షేమాధికారి అధికారి యు.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

కంకిపాడు: క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని కంకిపాడు సీఐ జె. మురళీకృష్ణ అన్నారు. మండలంలోని గొడవర్రు జిల్లా పరిషత్ పాఠశాలలో క్రమశిక్షణ, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ సక్రమ నడవడికతో ఉన్నత విద్యనభ్యసించాలని అన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తల్లిదండ్రులను గౌరవిస్తూ ఉన్నత విలువలు గల వ్యక్తులుగా సమాజంలోకి రావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ డి.సందీప్, హెచ్‌ఎం కె.సుబ్రహ్మణ్యం, ఎస్‌ఎంసీ చైర్మన్ వక్కలగడ్డ రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

100 మద్యం సీసాలు స్వాధీనం

కంకిపాడు: మద్యం అక్రమంగా తరలిస్తున్న ఘటనపై శనివారం కంకిపాడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని తెన్నేరు గ్రామంలో తనిఖీలు చేయగా నందమూరు గ్రామానికి చెందిన పెనుమత్స మహేష్, పేటేటి వంశీల వద్ద 100 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మద్యం రవాణాకు పాల్పడ్డ మహేష్, వంశీలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ డి.సందీప్ తెలిపారు.

60మందికి వైద్య సేవలు

గన్నవరం రూరల్: పరిసరాల పరిశుభ్రతతో మేలు కలుగుతుందని ముస్తాబాద పీహెచ్‌సీ డాక్టర్ సృజన పేర్కొన్నారు. శనివారం జక్కులనెక్కలం గ్రామంలో 60 మందికి 104 వాహన వైద్య సేవలు అందించారు. దీర్ఘకాల రోగులను పరీక్షించి మందులు అందజేసి అవగాహన కల్పించారు. జీవనశైలిని మార్చుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. సీహెచ్‌వో నిస్సీ, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి ఈశ్వర్ పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానంలో వచ్చే నెల మూడు నుంచి 12వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆలయంలో కమిటీ సభ్యులతో కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. భక్తులు శరన్నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కమిటీ సభ్యులు జాస్తి ఫణిశేఖర్, జాస్తి శ్రీనివాసరావు, పొట్ల శివలీల, చిమట శ్రీనివాసరావు, గండికోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యనమలకుదురులో విగ్రహాల వివాదం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో విగ్రహాల వివాదం ఏర్పడింది. గ్రామంలో కొండ వెనక ఉన్న ప్రాంతంలోని ప్రభుత్వ పోరంబోకు భూమిలో గతంలో సర్దార్ గౌతులచ్చన్న విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గౌతులచ్చన్న వర్ధంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రసాద్ దీనికి అంగీకరించారు. దీంతో గౌతులచ్చన్న విగ్రహం ఏర్పాటు చేయడానికి ఒక వర్గం కసరత్తు చేపట్టింది. ఈలోగా దివంగత నేత వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని శుక్రవారం రాత్రికి రాత్రే ఆయన అభిమానులు హడావుడిగా ఏర్పాటు చేశారు. దీంతో శనివారం గ్రామంలో వాతావరణం వేడెక్కడంతో సీఐ వెంకటరమణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో గౌతులచ్చన్న విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాగా విగ్రహాలు ఏర్పాటు చేసిన స్థలం గతంలో కోర్టు వివాదంలో ఉంది. ఈ ఘటన గ్రామంలో చర్చనీయంగా మారింది.

వ్యక్తిపై మద్యం సీసాతో దాడి

పెనమలూరు: ఒక వ్యక్తిపై మరోవ్యక్తి మద్యం సీసాతో దాడి చేయడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్‌ఐ ఫిరోజ్ కథనం మేరకు.. రామలింగేశ్వరనగర్‌కు చెందిన నడకుదుటి ఉదయ్‌కుమార్ యనమలకుదురులో ఎంవీఆర్ బార్ వద్ద పరిచయస్తుడు సైకం గోపిరాజుతో కలిసి మద్యం సేవించాడు. ఆ తర్వాత ఇద్దరికి మాటామాటా పెరగడంతో ఉదయ్‌కుమార్‌పై గోపిరాజు మద్యం సీసాతో తలపై దాడి చేశాడు. ఉదయ్‌కుమార్‌కు గాయాలు అవ్వడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితుడి మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం ఆరుగొలను వద్ద గుర్తు తెలియని వ్యక్తిని శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. ఆరుగొలను వద్ద అర్ధరాత్రి సమయంలో రోడ్డు ప్రక్కన నడుచుకుంటూ వెళుతున్న సుమారు 30 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతుని వివరాలు సేకరించేందుకు యత్నించారు. కాగా మృతుడు పొరుగు రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం ఆరుగొలను సమీపంలోని ఫ్యాక్టరీలో పని చేసేందుకు వచ్చి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఎస్‌ఐ ఏడీఎల్ జనార్దన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు బైక్ దొంగలు అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లి పోలీసులు ఇద్దరు బైక్ దొంగలను శనివారం అరెస్ట్ చేశారు. వీరవల్లి ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 26వ తేదీన బాపులపాడు మండలం ఉమామహేశ్వరపురంలో వీఆర్వో ఆర్నేపల్లి చైతన్యకుమార్ బైక్ చోరీకి గురైనట్లుగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన ఎస్‌ఐ శ్రీనివాస్‌కు శనివారం బైక్ ఆచూకీ లభించింది. దీంతో చాకచాక్యంగా వ్యవహరించి దుండగులు బడుగు ప్రభుకుమార్, షేక్ నిరీక్షణ్‌లను పట్టుకొని వారి నుంచి రెండు బైక్‌లు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్ట్ చేసి విజయవాడ కోర్టుకు తరలించడంతో న్యాయమూర్తి వారం రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అట్టహాసంగా ఆటల పోటీలు ప్రారంభం



క్రాంతిని సత్కరిస్తున్న ఎంఈఓ, కిషోర్, వ్యాయామ ఉపాధ్యాయులు



ఖోఖోలో విజేతగా నిలిచిన పునాదిపాడు శ్రీచైతన్య బాలుర జట్టు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలుత ఈ పోటీలను కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్ కిషోర్ ప్రారంభించారు. పోటీల్లో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన బాలబాలికలు పాల్గొన్నారు. క్రీడాకారులను ఎంఈఓ కె. రవికుమార్ పరిచయం చేసుకుని అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గ క్రీడల ఇన్‌చార్జి సిహెచ్. చంద్రశేఖర్(చందు), మూడు మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీడీ క్రాంతికి సత్కారం

ఇటీవల జిల్లా స్థాయిలో ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్. క్రాంతిని కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కారించారు. ఎంఈఓ కె. రవికుమార్, అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్. కిషోర్, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు ఆమెకు దుశ్శాలువాలు కప్పి జ్ఞాపికను అందజేశారు.

కంకిపాడు: మండలంలోని మంతెన జెడ్పీ పాఠశాలలో శనివారం మండల స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఖోఖో పోటీల్లో భాగంగా అండర్–14 బాలుర విభాగంలో పునాదిపాడు శ్రీచైతన్య విజేతగా, జెడ్పీ పాఠశాల మంతెన రన్నర్స్‌గా నిలిచాయి. పోటీలను మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జి ఎం.హరిగోపాల్, ఇన్‌చార్జి హెచ్‌ఎం రమణరావు, పీడీ రామలక్ష్మి, ఇతర పీడీలు పర్యవేక్షించారు.

ఎకరాకు రూ. 25వేలు నష్టపరిహారం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేశవరావు

ఉంగుటూరు: వరదల వల్ల నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ. 25వేలు నష్టపరిహారాన్ని రైతులకు అందించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు వై. కేశవరావు డిమాండ్ చేశారు. మండలంలోని కామ్రేడ్ మానికొండ సూర్యావతి శ్రామిక భవనం ఆవరణలో రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో శనివారం మండల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ జిల్లా, మండల స్థాయి అధికార యంత్రాంగం గ్రామాల్లో పర్యటించి వరదల వల్ల పంటలకు, ఇళ్లకు జరిగిన నష్టాన్ని ఎన్యూమరేషన్ సమగ్రంగా నిర్వహిస్తేనే పూర్తి స్థాయిలో అంచనా వస్తుందని అన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం చాలా కీలకమైనదని అలాంటి రంగాన్ని, రైతులను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వందలాదిమందితో ప్రదర్శనగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ జె. విమలకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై.నరసింహారావు పాల్గొన్నారు.

కంకిపాడు గ్రామసభ రసాభాస



కంకిపాడు: ప్రభుత్వ ఆదేశాలతో కంకిపాడు పంచాయతీలో శనివారం నిర్వహించిన మన ఇల్లు–మన గౌరవం గ్రామసభ రసాభాసగా మారింది. సమావేశానికి హాజరైన ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ పి. అనూష, తహసీల్దార్ వి. భావన్నారాయణ గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ ప్రసంగించారు. గృహ నిర్మాణాలు చేపట్టిన వారు అక్టోబరు నాటికి, ప్రారంభదశలో ఉన్న ఇళ్లు మార్చి 2025 నాటికి పూర్తి కావాలని, లేకపోతే బిల్లులు విడుదల కావని, ఇతర గృహ నిర్మాణ పథకాలు వర్తించవని స్పష్టంచేశారు. దీంతో సభకు హాజరైన గృహ నిర్మాణ లబ్ధిదారులు ప్రజాప్రతినిధులు, అధికారుల ప్రకటనకు విస్తుపోయారు. ఇళ్ల నిర్మాణాలు సజావుగా సాగేలా ఏర్పాట్లు, వసతులు కల్పించకుండా ఇళ్లు పూర్తి చేయమంటే ఎలా చేస్తామంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ క్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు లబ్ధిదారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి సభాస్థలికి చేరుకుని లబ్ధిదారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో లబ్ధిదారుల నుంచి ప్రశ్నల తాకిడి ఎక్కువ కావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు సభా ప్రాంగణం నుంచి వెళ్లిపోవడం గమనార్హం.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కంకిపాడు: మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల నియంత్రణ ఉద్యమాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్. జాకబ్‌రాజు కోరారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బందికి మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. జాకబ్‌రాజు మాట్లాడుతూ సోషల్ మీడియాకు బానిసలు కావొద్దని సూచించారు. ఆరోగ్య, మానసిక సమస్యలకు సోషల్ మీడియా దుర్వినియోగం కారణమవుతుందని పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.కల్యాణి, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ జె.జ్యోతి చంద్రిక, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వణుకూరులో స్వచ్ఛతాహీ సేవా

పెనమలూరు: వణుకూరు గ్రామంలోని గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శనివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, నెహ్రూ యువ కేంద్రం, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్తంగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం చేశారు. విద్యార్థులకు ప్లాస్టిక్ వ్యర్థాల నివారణపై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ విజయ, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్‌కు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు

పెనమలూరు: ఆక్యుపంక్చర్ వైద్యాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తిస్తూ గెజిట్‌జారీ చేసిందని ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. ఆయన శనివారం వివరాలు తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్టుమెంట్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆక్యుపంక్చర్ వైద్యాన్ని గుర్తిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఈనెల 26వ తేదీన జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏపీలో కూడా ఆక్యుపంక్చర్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని కోరారు.